క్లుప్తంగా

నూతన అటవీ చట్టం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

వేమనపల్లి: అడవులను కార్పొరేటీకరణకు అనుగుణంగా ఉన్న నూతన అటవీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ ఎరుకల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఉంద్రాల్ల ఎల్లయ్య డిమాండ్ చేశారు. వేమనపల్లి మండలం కల్మలపేట గ్రామంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ, ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆదిలాబాద్‌కు రానున్న బీజేపీ నేత అమిత్‌షా ఈ ప్రకటనలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పవన్, శ్రీనివాస్, మధునక్క తదితరులు పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌పై టీచర్లకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి యూడైస్‌ప్లస్, టీఎస్ ఈఎఫ్ఆర్ఎస్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, జిల్లా మానిటరింగ్ అధికారి రాజ్‌కుమార్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. యాప్ ప్రాధాన్యత, వినియోగం గురించి మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.మల్లేశం, తాండూర్ జెడ్పీ హైస్కూల్, ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సెమినార్


మాట్లాడుతున్న అధ్యాపకులు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంపల్లి శంకర్ ఆధ్వర్యంలో కామర్స్ సెమినార్ నిర్వహించారు. వ్యాపార వ్యవస్థ, నిర్వహణ, భాగస్వామ్యం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కళాశాలలో చదువుతున్న కామర్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వ్యాపార వ్యవస్థపై అవగాహన కల్పించడానికి నిర్వహించిన సదస్సు విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనేక ఉపాధి మార్గాల వైపు మళ్లడానికి వీలు కలుగుతుందని పేర్కొన్నారు. వ్యాపార సంబంధిత రంగాల్లో అనేక విధాల భాగస్వామ్యం కావడానికి అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీలత, కామర్స్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ మేడ తిరుపతి, అధ్యాపకుడు రవి, కామర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారంలో కుమురం భీం వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

భీమారం: మండల కేంద్రంలో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కుమురంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భీం చిత్రపటానికి సంఘం మండల అధ్యక్షుడు తైనేని రవితో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పల్ల బుచ్చయ్య, మార్నేని లచ్చన్న, పూజారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టు కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తిరుపతి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన వారు ఈ నెల 13లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

వినూత్నంగా 'మధ్యాహ్న' కార్మికుల సమ్మె

తాండూర్: సమస్యల పరిష్కారం కోసం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో 12వ రోజుకు చేరింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో కార్మికులు సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం డిమాండ్లను అంగీకరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.


జైపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు

బతుకమ్మ ఆడి నిరసన

నెన్నెల: పెండింగ్ బిల్లులు చెల్లించాలని, తమ డిమాండ్లు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పాటలు పాడుతూ.. బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు రామక్క, సులోచన, పద్మ, గౌరక్క తదితరులు పాల్గొన్నారు.


నెన్నెలలో బతుకమ్మ ఆడుతూ నిరసన


తాండూర్: నినాదాలు చేస్తున్న కార్మికులు

జైపూర్: ఉమ్మడి జైపూర్ మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు వారి సమస్యలు పరిష్కరించాలని, వేతనాలను పెంచాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం వంటావార్పు కార్యక్రమం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జైపూర్, భీమారం మండలాల అధ్యక్షుడు మనుబోతుల మధునమ్మ, రంగు సరిత, కార్మికులు భాగ్యలక్ష్మి, విజయ, అనసూర్య, రాజేశ్వరి, భీమక్క, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో అభివృద్ధి పరుగులు

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. కర్ణమామిడి గ్రామంలో రూ.5లక్షల సీడీపీ నిధులతో నిర్మించే డ్వాక్రా భవన నిర్మాణానికి, పడ్తనపల్లిలో రూ.5లక్షల సీడీపీ నిధులతో నిర్మించే పద్మశాలీ భవన నిర్మాణానికి, దొనబండలో రూ.5లక్షల సీడీపీ నిధులతో నిర్మించే పద్మశాలీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాజీపూర్‌లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని, రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించి భవిష్యత్ అభివృద్ధి, సంక్షేమానికి బంగారు బాటలు వేసేలా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కొట్టె మహేందర్, గోళ్ల శ్రీనివాస్, జాడి సత్యం, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, నాయకులు మందపల్లి శ్రీనివాస్, కోటి సత్తయ్య, జీవన్‌రావు, ఆయా గ్రామాల స్థానికులు పాల్గొన్నారు.


కర్ణమామిడిలో డ్వాక్రా భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

పనుల్లో నాణ్యత పాటించాలి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సోమవారం భూమిపూజ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మార్కెట్ యార్డులో సీసీ రోడ్లు, ఆర్వో ప్లాంట్ షెడ్లు ఇతర పలు రకాల అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.1.18కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని, తప్పనిసరిగా పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఇన్‌చార్జి కార్యదర్శి భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

హామీలు నెరవేర్చడంలో కేసీఆర్ విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథ్

నస్పూర్: గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కౌన్సిలర్ అగల్‌డ్యూటీ రాజుతో కలిసి సోమవారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన కొత్త క్వార్టర్ల నిర్మాణం, మారుపేర్ల మార్పునకు అవకాశం, ఉచిత కరెంట్, రెండు గుంటల ఇంటి స్థలం వంటి తదితర హామీలు నేటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటేనని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే నస్పూర్ మండలంలో జేఎన్‌టీయూ కాలేజీని ఏర్పాటు చేస్తామని, సింగరేణి కార్మికుల ఇన్‌కంటాక్స్ సింగరేణి యాజమాన్యం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, నస్పూర్‌ని అవినీతి లేని, భూ కబ్జాలు లేని నస్పూర్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తమకు ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేష్, దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌శాఖలో కీలక మార్పులు

- బ్యాంకుల మాదిరిగా అన్ని సేవలు అందిస్తున్నాం
- పోస్టల్ శాఖ సబ్ డివిజనల్ అధికారి రామారావు


అవగాహన కల్పిస్తున్న రామారావు

భీమారం: బ్యాంకుల మాదిరిగానే పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల పోస్టల్ శాఖ సబ్‌డివిజనల్ అధికారి రామారావు కోరారు. పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం భీమారం మండల కేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్ వద్ద పోస్టల్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్టల్‌శాఖలో కీలక మార్పులు జరిగాయని, బ్యాంకులు అందిస్తున్న వివిధ పథకాలను పోస్టల్ శాఖ అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై, బ్యాంకుల కన్నా అధికంగా వడ్డీలు చెల్లిస్తున్నామన్నారు. బీమా సదుపాయం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమల, సబ్‌పోస్ట్ మాస్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రమోషన్ పత్రాలు పంపిణీ


పత్రాలు అందిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే6లో 2022సంవత్సరంలో 190/250 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్లుగా పదోన్నతిని కల్పించారు. గనిపై సోమవారం జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి పదోన్నతుల పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులు పొందిన వారు మరింత బాధ్యతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసు శ్రీనివాస్, డెప్యూటీ మేనేజర్ కొమరయ్య, ఫిట్ ఇంజనీర్ శ్యామ్ కుమార్, ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

తిలక్ వాకర్స్ సేవలు అభినందనీయం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లికి చెందిన తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ సోమవారం గర్భిణీ స్త్రీలకు ఉచిత పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పొగతో గురుకుల విద్యార్థుల ఉక్కిరి బిక్కిరి



బెల్లంపల్లి: మున్సిపాలిటీ డంప్ చేసిన చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో సోమవారం రాత్రి సమీపంలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ విద్యార్థులు పొగతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రాత్రి 10గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఐటీడీఏ ఉద్యానవనం పక్కన డంప్ చేసిన చెత్త నుంచి మంటలు వ్యాపించాయి. ఆ మంటల నుంచి దట్టంగా పొగ కమ్ముకుని, ఎల్లమ్మ గుడి వరకు వ్యాపించడంతో ఒక్కసారిగా ప్రజలు, విద్యార్థులు ఉలిక్కిపడ్డారు. రాత్రి పూట పొగ ధారాళంగా రావడంతో శ్వాసకోస సమస్యలు ఉన్న ఇందిరమ్మ కాలనీవాసులు, సంక్షేమ గురుకుల, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు భరించలేక సతమతమయ్యారు. మంటలు ఆర్పడానికి సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి విద్యాసంస్థలకు చేరువలో చెత్తను డంప్ చేయడంతో విద్యార్థులు, ఇందిరమ్మ కాలనీవాసులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

'అభివృద్ధి విషయంలో అధికార పార్టీ వివక్ష'

నస్పూర్: పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికార పార్టీ వివక్ష చూపిస్తుందని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు ఆరోపించారు. అధికార పార్టీ ధోరణిని నిరసిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు సీసీసీ కార్నర్ వద్ద ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పట్టణంలో అధికార పార్టీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దీక్షా శిబిరాన్ని సందర్శించి కౌన్సిలర్లకు నిమ్మరసం ఇచ్చి, వారిని దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శీపతి సుమతి, బండారు సంధ్యారాణి, తెనుగు లావణ్య, గెల్లు రజిత, బొద్దున సంధ్యారాణి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


దీక్ష విరమింపజేస్తున్న కొక్కిరాల సురేఖ

గురుకుల పాఠశాలకు రూ.2.50లక్షలు అందజేత

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యుత్ దీపాలు, ఇతర కరెంటు సామగ్రితో పాటు మోటార్ కోసం భీమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి రూ.2.50లక్షల ఆర్థిక సాయం అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజమణి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు తగరం అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల13 నుంచి 16వరకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా పోటీలకు ఆరు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. క్రీడా మైదానంలో ఫ్లడ్ లైట్లతో పాటు శాశ్వత వైరింగ్, విద్యార్థుల అవసరాలకు నీటి సరఫరా కోసం మోటార్‌లు అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని సరోత్తంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే రూ.2.50లక్షల విలువైన విద్యుత్ సామగ్రితో పాటు మోటార్‌లను తెప్పించారని తెలిపారు. విద్యార్థుల కోసం ఆర్థిక సాయం అందించిన సరోత్తంరెడ్డిని సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

కాసిపేట: ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ కాసిపేట మండలంలోని ప్రజాప్రతినిధులు సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. అనంతరం కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా, అభివృద్ధి పనులను అధికార పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాప్రతినిధులను అవమానించిన అధికారులకు, ఎమ్మెల్యేకు ప్రజలే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోనూరు సర్పంచ్ స్వరూప, ధర్మరావుపేట ఎంపీటీసీ పార్వతి మల్లేష్, మల్కెపెల్లి ఎంపీటీసీ భీంరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక దరఖాస్తు వచ్చింది. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజావాణిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నా, ప్రజలు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం వర్ధంతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కాన్షీరాం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి వేడుకల్లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా సభ్యుడు రేగుంట లింగయ్య, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, ఎంపీటీసీ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: కాన్షీరాం వర్ధంతిని మండలంలోని అంబేడ్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సంఘ భవనంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాందాస్, ప్రధాన కార్యదర్శి రవి, సభ్యులు రాజు, శ్రీనివాస్, సాగర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం

మంచిర్యాలక్రైం: గర్మిళ్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి నిర్వాహకులు సంయుక్తంగా సోమవారం స్థానిక రాంనగర్‌లోని నారాయణ హైస్కూల్లో ఉచిత నేత్ర వైద్య చికిత్స ఈ నెల 13న నిర్వహించనున్నట్లు గర్మిళ్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోదుంపురం వెంకటేశ్వర్ తెలిపారు. కంటి సమస్యలు ఉన్నావారు, (దృష్టి దోశాలు) మెల్లకన్ను ఉన్న వారిని గుర్తించి ఉచిత బస్ సౌకర్యంతో పాటు కరీంనగర్ తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 12న ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని సున్నంబట్టి వాడలోని లయన్స్ భవన్‌లో కూడా ఉచిత నేత్ర వైద్య చికిత్స నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు బాలాజి తెలిపారు. ఈ వైద్య శిబిరాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డ్, తెల్లరేషన్ కార్డ్ జిరాక్స్ వెంట తీసుకురావాలని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ సద్దనపు రాంచందర్, క్లబ్ డైరెక్టర్ గాజుల ముకేష్ గౌడ్, వంల సంపత్‌కుమార్, రామోజు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శి వెంకటేశ్వర్లు, మధుసూధన్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, డేగ బాపు, శ్యాంసుదర్‌రావ్, రామంజనేయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భీమిని ఎస్సైగా ప్రశాంత్ బాధ్యతలు స్వీకరణ

భీమిని: భీమిని నూతన ఎస్సైగా ఎం.ప్రశాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఆయన భీమిని పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మహేందర్ రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.



సంక్షిప్త వార్తలు

రూ.50వేలు ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: పాత బస్టాండ్ ఏరియాలోని జాతీయ రహదారి పక్కన టైర్ పంచర్ కొట్టు పెట్టుకున్న సర్జీత్‌సింగ్ రోడ్డు వెడల్పులో భాగంగా పంచర్ కొట్టు కోల్పోయాడు. దీంతో జీవనోపాధి ఇబ్బందిగా మారడంతో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1979-80లో అతడితో పాటు పదో తరగతి చదివిన చిన్ననాటి మిత్రులు కొందరు సేకరించిన రూ.50వేలను సర్జీత్ సింగ్‌కు అందించారు.

కన్నెపల్లి డెప్యూటీ తహసీల్దార్‌గా గోవర్ధన్

భీమిని: కన్నెపల్లి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గోవర్ధన్‌కు డెప్యూటీ తహసీల్దార్‌గా ప్రమోషన్ రాగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

చెన్నూర్‌రూరల్: రైతులు పంటల్లో చేపట్టే సస్యరక్షణ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారిని(ఏఈఓ) కవిత సూచించారు. మండలంలోని ఆస్నాద్, సోమనపల్లి, గ్రామాల్లో ఆయిల్ పాంలో అంతర్ పంట వేసిన రైతులను కలిసి అవగాహన కల్పించారు.

కులమతాలకతీతంగా వాసవీ క్లబ్ సేవలు

మంచిర్యాలక్రైం: కులమతాలకతీతంగా సేవలందించడమే లక్ష్యంగా వాసవీ క్లబ్ పనిచేస్తుందని వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథం శ్రీనివాస్ అన్నారు. స్థానిక హైలైఫ్ ఫంక్షన్ హాల్లో వాసవీ క్లబ్ డిస్టిక్ వి 107 ఏ పరిధిలోని రిజియన్-1, రిజియన్-2, కొంకుమట్టి పురస్కారాలు, అక్కెనపెల్లి పురస్కారాల ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిజియన్ చైర్మన్లు కొంకుమట్టి వెంకటేష్, అక్కెనపెల్లి రవీందర్, సిరిపురం సత్యనారాయణ, శ్రీనివాస్, బాల సంతోషాలు, రిజియన్ సెక్రటరీలు, జోన్ చైర్మన్లు, మంచిర్యాల వాసవీ క్లబ్, వణితాక్లబ్, నస్పూర్ క్లబ్, తాండూర్, మందమర్రి, ఆసిఫాబాద్‌ల వాసవీ క్లబ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

చెగువేరా వర్ధంతి

లక్సెట్టిపేట: గెరిల్లా పోరాటయోధుడు చెగువేరా వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని ఏఐవైఎఫ్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ భవన్‌లో ఆయన ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెన్నూర్: పట్టణంలోని మోటర్స్, వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో చెగువేరా, కాన్షీరాం వర్ధంతి వేడుకలను ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్ మాట్లాడుతూ చెగువేరా యువతకు ఐకాన్‌గా నిలిచారన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తాండూర్: మండలంలోని కొత్తపల్లి, కాసిపేట గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ ప్రణయ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల రజిత, ఎంపీటీసీలు మాసాడి శ్రీదేవి, సిరంగి శంకర్, స్థానికులు పాల్గొన్నారు.